సాక్షి
అనకాపల్లి
సోమవారం ၊ 3 ၊ జూలై ၊ 2023



భారీ వర్షం
పలు మండలాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.
8లో



నూకాంబికకు ప్రత్యేక పూజలు
గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు
8లో



డోలీ కష్టాలకు మోక్షం
ఇక డోలీ కష్టాలు తప్పనున్నాయి. ఏళ్ల నాటి కల సాకారమవుతోంది. చలిసింగం రోడ్డు పనులు చకచకా సాగుతున్నాయి.
8లో

సింహగిరి.. భక్తఝరి

- గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు
- భక్తులతో కిక్కిరిసిన 32 కి.మీ మార్గం



కొబ్బరికాయ కొట్టి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ



రథోత్సవంలో భక్తజనం

విరులు పులకించాయి. ఝరులు స్వాగతించాయి. గిరులు ఉప్పొంగిపోయాయి. అడుగులో అడుగేస్తూ అప్పన్నను తలుస్తూ ముందుకు సాగింది భక్తజనం. అన్ని దారులూ సింహగిరివైపే.. అందరి నోటా గోవింద నామస్మరణే.. స్వామి తలంపుతో గిరియాత్ర సాగిపోయింది. సింహ గిరీశా పాహిమాం.. రక్షమాం .. అంటూ భక్తజనం వేడుకుంది. స్వామే నడిపిస్తున్నారనే భావనతో అలవోకగా ప్రదక్షిణలో నిమగ్నమైంది. భక్తిభావం ఉప్పొంగింది. ఎటు చూసినా ఉత్సాహం.. గిరి ప్రదక్షిణోత్సాహం..

సింహాచలం: ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సింహగిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. 32 కిలోమీటర్ల ప్రదక్షిణలో ఈ ఏడాది లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ చేసేందుకు ఉదయం 5 గంటల నుంచే సింహాచలానికి భక్తులు చేరుకున్నారు. రాత్రి 11 వరకు ప్రదక్షిణ చేసేందుకు భక్తులు సింహాచలం తరలివస్తూనే ఉన్నారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు ప్రదక్షిణకు తరలివచ్చారు. పెద్ద ఎత్తున మహిళలు, యువత గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.



కాంతార వేషధారణ

తొలిపావంచా వద్ద ప్రారంభం

ఆదివారం మధ్యాహ్నం 2.40 గంటలకు తొలిపావంచా వద్ద దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు తొలిపావంచా వద్ద శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మొక్కుకొని కొబ్బరికాయలు కొట్టి.. స్వామి నామస్మరణ చేస్తూ రథాన్ని అనుసరించారు. తొలిపావంచా నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ అడవివరం జంక్షన్, పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, వెంకోజీపాలెం, హెచ్‌బీకాలనీ, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం, నరసింహనగర్, డీఎల్‌బీ క్వార్టర్స్, సీఐఎస్‌ఎఫ్ బ్యారెక్స్, ఎన్‌జీవో కాలనీ, మాధవధార, మురళీనగర్, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, కుమారి కల్యాణమండపం, ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, పాతగోశాల మీదుగా సింహాచలం వరకు జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు రథంలో ఉన్న స్వామికి పూజలు నిర్వహించారు. కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, దేవదాయశాఖ ఏసీ శిరీషా తదితరులు రథయాత్రలో పాల్గొన్నారు



ప్రదక్షిణ చేస్తున్న వృద్ధుడు

అప్పుఘర్‌లో సముద్ర స్నానాలు

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న పలువురు భక్తులు నగరంలోని అప్పుఘర్ ప్రాంతంలో సముద్ర స్నానాలు ఆచరించారు. అలాగే మార్గంమధ్యలో ఉన్న మాధవ ధారలోని మాధవ స్వామి ఆలయం వద్ద కూడా స్నానాలు ఆచరించారు. మాధవ స్వామిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రథోత్సవంలో దేవస్థానం ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాంతార డ్యాన్స్, పులివేషాలు, కాళీ నృత్యాలు, తప్పెటగుళ్లు, డప్పు వాయిద్యాలు అలరించాయి.



కోలాటం

విశేషంగా ఏర్పాట్లు

గిరి ప్రదక్షిణని పురస్కరించుకుని కలెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేశారు. 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ జరిగే కొండచుట్టూ 29 ప్రదేశాల్లో విశ్రాంతి శిబిరాలు ఏర్పాటు చేశారు. శిబిరాల్లో జీవీఎంసీ మంచినీటిని విరివిగా అందించింది. దారిపొడవునా 11 ప్రదేశాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేశారు. పలు ప్రైవేటు హాస్పటల్స్ శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సేవలు అందించాయి.

నగర పోలీస్ కమీషనర్ త్రివిక్రమ్‌వర్మ సారథ్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దారిపొడవునా 50కిపైగా స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఆహార పదార్థాలు, మజ్జిగ, శీతల పానీయాలు అందజేశాయి.



తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టేముందు స్వామికి నమస్కరిస్తున్న భక్తులు



సముద్రం వద్ద భక్తుల స్నానాలు



రథం వద్ద పూజలు చేస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ

ఏర్పాట్లు భేష్



గిరి ప్రదక్షిణలో భక్తులకు ఇబ్బంది లేకుండా చేసిన ఏర్పాట్లు బాగున్నాయి. తాగు నీరు, టాయిలెట్లు ఏర్పాటు చేశారు. మహిళలు సముద్ర స్నానమాచరించి దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లూ చేశారు.

–నారాయణమ్మ, చీడికాడ

ఎక్కడికక్కడే వైద్య శిబిరాలు



గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ఇది తొమ్మిదోసారి. గతంలో కన్నా ఈ ఏడాది సౌకర్యాలు బాగున్నాయి. మంచినీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, వైద్య శిబిరాల ఏర్పాటు బాగున్నాయి.

–నిద్ర సరోజిని, కొన్నేరుపాలెం, కశింకోట మండలం, అనకాపల్లి జిల్లా



తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టే భక్తుల రద్దీ

ప్రదక్షిణలో పదనిసలు

- గిరి ప్రదక్షిణకు ఉదయం 5 గంటల నుంచే భక్తులు సింహాచలం చేరుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి భక్తుల సంఖ్య పెరుగుతూ రాగా మధ్యాహ్నం సమయానికి విపరీతంగా రద్దీ నెలకొంది. సాయంత్రం వర్షం కురవడంతో చెప్పులు లేకుండా నడిచేందుకు భక్తులు మరింతగా చేరుకున్నారు.
- ఉదయమే గిరిప్రదక్షిణ ప్రారంభించి సాయంత్రానికి తిరిగి సింహాచలం చేరుకున్న భక్తులకు రాత్రి 10 గంటల వరకు దర్శనాలు కల్పించారు.
- తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టే భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఈఏడాది 39 క్యూలను ఏర్పాటు చేశారు. అలాగే కొబ్బరికాయలు కొట్టేందుకు వీలుగా 70 ర్యాపులను ఏర్పాటు చేశారు.
- ఈసారి రెండో ఘాట్‌రోడ్డు వద్ద స్వామివారి నమూనా ఆలయం ఏర్పాటు చేసినా భక్తులెవరూ అక్కడ కొబ్బరికాయలు కొట్టేందుకు వెళ్లలేదు. సంప్రదాయంగా వస్తున్న పాత పద్ధతినే పాటించి తొలిపావంచా వద్దనే కొబ్బరికాయకొట్టి ప్రదక్షిణ ప్రారంభించారు.
- తొలిపావంచా వద్ద కొబ్బరి చెక్కలను ఎప్పటికప్పుడు తరలించేందుకు క్రేనులు, పెద్ద సంఖ్యలో లారీలు ఏర్పాటు చేశారు.
- నగరం నుంచి పాత గోశాలవైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను ఉదయం నుంచే గోశాల జంక్షన్‌కి సమీపంలో నిలిపివేశారు. అక్కడి నుంచి తొలిపావంచాకి భక్తులు కాలినడకనే వెళ్లారు. సాయంత్రానికి గోపాలపట్నం నుంచి సింహాచలం వరకు, వేపగుంట నుంచి సింహాచలం వరకు కూడా పెద్ద సంఖ్యలో భక్తులు నడిచి వచ్చారు. ఈ రెండు మార్గాల్లోను ఇసుకేస్తే రాలనంతంగా రద్దీ నెలకొంది.
- హనుమంతవాక వైపు నుంచి భక్తులు కాలినడకనే గాంధీనగర్, వరాహ పుష్కరిణి, రాజవీధి మీదుగా తొలిపావంచా చేరుకున్నారు.
- అటు పాత గోశాల జంక్షన్, ఇటు అడవివరం జంక్షన్‌ల నుంచి వచ్చే భక్తుల వాహనాలను అడవివరం మెయిన్‌రోడ్డులోకి అనుమతించలేదు. సింహపురి కాలనీ వైపు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డు, పాత అడవివరం వైపు పార్క్ చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లుచేశారు.
- పాత గోశాలవైపు నుంచి ప్రదక్షిణ చేసేందుకు వచ్చే భక్తులను పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి రోడ్డుకు ఎడమవైపున ఉన్న మార్గంలో కంపార్ట్‌మెంట్‌లుగా ఏర్పాటు చేసి రద్దీకి అనుగుణంగా కొబ్బరికాయలు కొట్టేందుకు పోలీసులు పంపించారు.

న్యూస్‌రీల్

ఐఎఫ్‌పీపై ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న సత్యనారాయణ, రాజగోపాల్

మాకవరపాలెం: ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) విధానంలో బోధన చేయడంపై ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభమైంది. ప్రభుత్వం కొత్తగా ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌పీ విధానంలో బోధన చేసేందుకు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు 15 రోజులపాటు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం మొదటి బ్యాచ్‌కు బైజూస్ యాప్‌తోపాటు ఐఎఫ్‌పీపై శిక్షణ ఇచ్చారు. బ్యాచ్‌కు వంద మంది చొప్పున రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్టు శిక్షకులు సత్యనారాయణ, రాజగోపాల్, వెంకటరావ్ తెలిపారు. ఈ శిక్షణకు గణేష్, లక్ష్మి కో ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు.

12 ఆవుల స్వాధీనం

కొత్తవలస గోశాలకు తరలింపు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆవులు

నాతవరం: అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధం చేసిన ఆవులను స్వాధీనం చేసుకున్నట్టు నాతవరం ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. కబేళాలకు తరలించేందుకు మండలంలో డి.యర్రవరం సమీపంలోని జీడి తోటల్లో 12 ఆవులను ఉంచినట్టు సమాచారం అందడంతో దాడిచేసినట్టు ఆయన చెప్పారు. ఆవులను స్వాధీనం చేసుకుని, డి.యర్రవరం గ్రామానికి చెందిన ముగ్గురిని పట్టుకున్నట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోసంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. ఆవులను విజయనగరం జిల్లా కొత్తవలసలో గోశాలకు తరలించినట్టు చెప్పారు.

శభాష్ వలంటీర్



వికలాంగురాలు దివ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వనజ

మునగపాక: మండల కేంద్రం మునగపాకకు చెందిన దివ్యాంగురాలు మాదాబత్తుల దివ్య ప్రస్తుతం నర్సీపట్నంలో ఉంటున్నారు. స్థానిక వలంటీర్ దొడ్డి వనజ ఆదివారం నర్సీపట్నం వెళ్లి రూ.5వేల పింఛన్ అందజేశారు.దీంతో ఆమెను పలువురు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మారేపల్లిలో గిరి ప్రదక్షిణ



మారేపల్లిలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

దేవరాపల్లి: మారేపల్లిలో ఆదివారం నిర్వహించిన గిరిప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. గ్రామంలో పాండవుల మెట్టపై సుమారు వందేళ్ల చరిత్ర కల్గిన పురాతన శ్రీదేవి భూదేవి కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. తొలి సారిగా ఇక్కడ చేపట్టిన గిరి ప్రదక్షిణలో పరిసరగ్రామాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ రద్దీగా మారాయి. పాండవులమెట్ట వద్ద శారదా నది ఒడ్డున స్వామి వారి పాదాల వద్ద పూజలు చేసి సాయంత్రం 4 గంటల ప్రాంతంలో భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. గోవింద నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.వాక ముత్యాలమ్మ తల్లి జంక్షన్, వెంకటరాజుపురం, తెనుగుపూడి భీమలింగేశ్వర ఆలయం, మారేపల్లి బీసీ కాలనీ మీదుగా వేంకటేశ్వర స్వామి పాదాల వద్దకు చేరుకుని ముగించారు. సుమారు ఏడు కిలోమీటర్ల మేర సాగిన గిరి ప్రదక్షిణ సమయంలో భారీ వర్షం కురవడంతో భక్తులు పులకించిపోయారు. దాతలు మజ్జిగ, పులిహోరా పంపిణీ చేశారు

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- జిల్లాలోని అన్ని స్థానాల్లో పార్టీ జెండా ఎగిరేలా కృషి
- మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ
- ప్రసాద్‌కు ఘన స్వాగతం పలుకుతూ అనకాపల్లి నుంచి మునగపాక వరకూ భారీ బైక్ ర్యాలీ



ర్యాలీగా వెళుతున్న మంత్రి అమర్‌నాథ్, బొడ్డేడ ప్రసాద్, ఈర్లె అనురాధ, సుకుమార్‌వర్మ, రమాకుమారి

అనకాపల్లిటౌన్/మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అనకాపల్లి వచ్చిన ప్రసాద్‌కు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు. అనకాపల్లి నుంచి మునగపాక వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక రైల్వేస్టేషన్ రహదారి భీమునిగుమ్మం జంక్షన్‌లో బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాడుగుల జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ దివంగత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం వద్ద భారీ బైక్ ర్యాలీని మంత్రి అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ ర్యాలీ రింగ్‌రోడ్డు నుంచి పెరుగుబజార్ జంక్షన్, నెహ్రూచౌక్, ఆర్టీసీ కాంప్లెక్స్, జాతీయ రహదారి మీదుగా మునగపాక వరకు సాగింది. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్, బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా కృషి చేస్తామన్నారు. అనంతరం పెరుగుబజార్ జంక్షన్, జాతీయ రహదారిలో దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసినివాళులర్పించారు. యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జోసఫ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, వైఎస్సార్‌సీపీ 83వ వార్డు ఇన్‌చార్జ్ జాజుల రమేష్ పాల్గొన్నారు.

త్వరలో జిల్లాస్థాయి సమావేశం

పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు బైక్ ర్యాలీతో పాటు ప్రత్యేక వాహనంపై మునగపాక నందీశ్వర ప్రాంగణానికి చేరుకుని అక్కడ మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నందీశ్వర కళావేదిక తులసి ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడారు. తనకు జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదన్నారు. తనను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలో అనకాపల్లిలోని రావుగోపాలరావు కళామందిరంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సభకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా మంత్రులు,ఎమ్మెల్యేలు హాజరవుతారని చెప్పారు.డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ జిల్లాలో అన్ని స్థానాల్లో పార్టీ విజయకేతనం ఎగురవేసేలా కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ చిక్కాల రామారావు,ఎంపీపీలు మళ్ల జయలక్ష్మి, కోన సంధ్య బుజ్జి,జెడ్పీటీసీలు పెంటకోట స్వామి సత్యనారాయణ,లాలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రసాద్,సుకుమారవర్మలను శాలువాలు,పూలదండలతో ఘనంగా సత్కరించారు.



మునగపాకలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

నెరవేరిన పేదల సొంతింటి కల



నిర్మాణం పూర్తయిన టిడ్కో గృహాలు



టిడ్కో గృహాల పనులను పరిశీలిస్తున్న జె. ప్రసన్నకుమార్

- యలమంచిలిలో పూర్తయిన టిడ్కో గృహ సముదాయం
- నేడు 432 మందికి ఇళ్లు అందజేత
- హాజరుకానున్న నలుగురు మంత్రులు
- ఇళ్లను పరిశీలించిన టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

యలమంచిలి: పేదల సొంతింటి కల నెరవేరింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సకల వసతులతో యలమంచిలిలోని ఎర్రవరం సమీపంలో హైవే వద్ద నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను మంత్రుల చేతుల మీదుగా సోమవారం లబ్ధిదారులు అందుకోనున్నారు.జిల్లాలో తొలిసారిగా ఇక్కడ టిడ్కో గృహసముదాయంలో 432 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందజేయనుండడంతో పండగ వాతావరణం నెలకొంది. పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపుసురేష్‌తో పాటు డిప్యూటీసీఎం బూడి ముత్యాలనాయుడు,పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గిరిజనశాఖ మంత్రి పీడిక రాజన్న దొర చేతుల మీదుగా సోమవారం లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.సొంతింటి కల నెరవేరుతున్నందుకు లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ గృహ సముదాయాలు పూర్తి చేయడం,మౌలిక వసతుల కల్పనలో ఎమ్మెల్యే కన్నబాబురాజు.టిడ్కో చైర్మన్ జమ్మానప్రసన్నకుమార్‌ప్రత్యేకచొరవ చూపారు.

గృహ నిర్మాణాలు ఇలా.. : ఇక్కడ నిర్మించిన 432 గృహాల్లో 300 చదరపు గజాల ఇళ్లు 96.., 365 చదరపు గజాల ఇళ్లు 144.., 430 చదరపు గజాల ఇళ్లు 192 ఉన్నాయి. మొత్తం 4.75 ఎకరాల్లో రూ.37.07 కోట్లను వెచ్చించారు. ఇందులో హౌసింగ్‌కు రూ.31.22 కోట్లు,విద్యుదీకరణకు రూ.0.37 కోట్లు, మౌలిక వసతులకు రూ.4.03 కోట్లు, ఎస్టీపీకి రూ.1.45 కోట్లు ఖర్చు చేశారు.మొత్తం 432 ఇళ్లలో 417మందికి రిజిస్ట్రేషన్ చేయించారు.మిగిలిన 15 గృహాలకు రిజిస్ట్రేషన్‌ప్రక్రియ పూర్తి చేయించేందుకు చర్యలు చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలన : యలమంచిలిలో సోమవారం జరగనున్న టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమం ఏర్పాట్లను రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆదివారం పరిశీలించారు.టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన టిడ్కో గృహ సముదాయాలను పూర్తిచేసి పేదలకు న్యాయం చేస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ డి.నరసింహమూర్తిరావు, మున్సిపల్‌కమిషనర్ వీరయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.సుధాకర్ ఉన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్యే కన్నబాబురాజు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి తదితరులు హాజరుకానున్నారు.

బంధువులకు మృతదేహాల అప్పగింత

మహారాణిపేట : అచ్యుతాపురం సాహితీ ఫార్మా ప్రమాదంలో మరణించిన ఇద్దరు కార్మికుల మృతదేహాలకు ఆదివారం పోస్టుమార్టం జరిగింది. పరిశ్రమలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో పైలా సత్తిబాబు, ఉప్పాడ తిరుపతి మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడిన సంగతి విదితమే. పోలీసుల నుంచి పంచనామా నివేదిక రావడంతో ఆదివారం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రస్తుతం కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాక్‌లో నూక నాయుడు చికిత్స పొందుతున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు.

మరొక కార్మికుడి మృతి

తీవ్రంగా గాయపడి ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుల్లో ఆదివారం సమ్మెంగి అప్పారావు మృతి చెందాడు. బియ్యం రామేశ్వర్, సాగిరెడ్డి రాజబాబు, సంతోష్ చికిత్స పొందుతున్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం



పెద్దలకు విరాళం అందిస్తున్న దాతలు

చీడికాడ: మండలంలోని జైతవరంలో నూతన రామాలయ నిర్మాణానికి ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల సచివాలయం కన్వీనర్ ఈర్లె చైతన్య రూ.లక్ష విరాళంగా ఆదివారం గ్రామ పెద్దలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి కీర్తిశేషులు దుర్గయ్య జ్ఞాపకార్థంగా ఈ మొత్తం అందించానన్నారు. గ్రామానికి చెందిన వీఆర్వో కోడూరి శేఖర్‌రావు తన వంతు విరాళంగా రూ.50 వేలు అందించారు.

డోలీ కష్టాలకు మోక్షం

- నెరవేరనున్న చలిసింగం గిరిజనుల కల
- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చొరవతో రోడ్డు నిర్మాణం
- త్వరలో లోసింగి మీదుగా వాహనాల రాకపోకలు
- నేడు పరిశీలించనున్న ఎంపీ సత్యవతి, విప్



ఒక నాడు రాళ్లూ రప్పలతో నడక దారి



యంత్రాలతో పనులు చేయిస్తున్న ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం: గర్భిణులకు పురిటినొప్పులు వచ్చినా, ఎవరైనా పాముకాటుకు గురైనా, ఏ చిన్నపాటి అనారోగ్య సమస్య తలెత్తినా డోలీ మోతలే చలిసింగం గిరిజనులకు శరణ్యమయ్యేది. ఆ సమయంలో ఎంతోమందికి సకాలంలో వైద్య సేవలందక మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో వారికి డోలీమోతల కష్టాలు తొలగనున్నాయి. ఏళ్ల నాటి కల సాకారమయ్యే దిశగా రోడ్డు పనులు చకచకా సాగుతున్నాయి. ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి ప్రచారం లేకుండానే 80 శాతం మేర పూర్తయ్యాయి. ఆ రహదారి పనులను సోమవారం ఆయనతోపాటు ఇక్కడికి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వస్తున్న ఎంపీ భీశెట్టి సత్యవతి పరిశీలించనున్నారు.

మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు చలిసింగం గ్రామం వెళ్లాలంటే మూడు కొండలు ఎక్కి దిగాల్సిందే. ఆ గ్రామంలో సుమారుగా 500 మంది జనాభా ఉంది. వారికి ఏ ఆపద వచ్చినా రాళ్లూ రప్పలపై నడక దారి తప్ప మరే గత్యంతరం లేదు.

ప్రతి ఎన్నికల్లోనూ రహదారి హామీ:

ఎన్నికల సమయంలో ఇన్నేళ్లుగా ప్రతి నాయకుడు రహదారి హామీ ఇస్తూ వస్తున్నారు. అయితే కొండల్లో ఘాట్ నిర్మించేందుకు అటవీ అనుమతులు రాకపోవటంతో ఇప్పటి వరకూ దానిని సాకుగా చూపించి తప్పించుకునేవారు. అయితే ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాత్రం చలిసింగం గిరిజనులకు డోలి మోతలు తప్పిస్తాం, రోడ్డు ఏర్పాటు చేయిస్తా అంటూ ఇచ్చిన హామీ మేరకు పనులు చేయిస్తున్నారు.

విప్ ధర్మశ్రీ పట్టుదలతో...

చలిసింగం గ్రామానికి రావికమతం మండలం నుంచి గాక రోలుగుంట మండలం లోసింగి నుంచి నడక దారి ఉంది. ఒక్కో చోట బండి బాట గానూ మరొక్క చోట రాళ్లూ రప్పలు ఉన్నాయి. అయితే ఘాట్ నిర్మించే అవసరం లేదు. ఆ రహదారి నుంచైనా ఏదో ఒకలాగా ఆ గ్రామానికి రోడ్డు పూర్తి వేయించాలని విప్ ధర్మశ్రీ సంకల్పించారు. ఈ మేరకు అధికారులతో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. రూ. 40 లక్షలు వెచ్చిస్తే బైక్, ఆటో, కారు వెళ్లేలా రోడ్డు ఏర్పాటు చేయవచ్చని అధికారులు సూచించారు. తక్షణమే ఆయన రావికమతం, రోలుగుంట ఎంపీపీలు పైల రాజు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్‌లతో సమావేశమై రహదారిని సైతం పరిశీలించారు.

ఈ మేరకు రావికమతం, రోలుగుంట మండల పరిషత్ నిధులు నుంచి రూ.15 లక్షలతోపాటు మరి కొన్ని నిధులు జోడించి భారీ యంత్రాల సహాయంతో పనులు చేయిస్తున్నారు. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయ్యాయి. వీటిని సోమవారం పరిశీలించనున్నారు.

ఏ రోడ్డు పనీ ఆగదు



ప్రజలకిచ్చిన హామీ మేరకు రోడ్డు పనులన్నీ పూర్తి చేయిస్తా. రూ.120 కోట్లతో వెలంకాయపాలెం నుంచి గంధవరం వరకు బీఎన్ రోడ్డును విస్తరించే పనులు జరుగుతున్నాయి. రూ.1.16 కోట్లతో గుడివాడ గ్రామానికి, రూ.75 లక్షలతో అయితంపూడి గ్రామానికి బీటీ రోడ్డును రెండు నెలల్లో పూర్తి చేయిస్తా. మర్రివలస –గొల్లలపాలెం రోడ్డును రూ.60 లక్షలతో పూర్తి చేయించి, రావికమతం నుంచి తోటకూరపాలెం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు వారం రోజుల్లోనే నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తాను.

– కరణం ధర్మశ్రీ ప్రభుత్వ విప్

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆదివారం కావడంతో అనకాపల్లితోపాటు విశాఖ, విజయనగరం జిల్లాల వాసులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నివేదించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతల పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో బండారు ప్రసాద్ కల్పించారు. సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలను మాత్రమే అమ్మవారి ఆలయం వరకూ అనుమతించి, మిగిలిన వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేశారు.

మోదకొండమ్మకు ప్రత్యేక కుంకుమ పూజలు



నగల అలంకరణలో మోదకొండమ్మ



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. అనకాపల్లి, విశాఖ, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావడంతో ఇక్కడ ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు.

అదేవిధంగా మాడుగులకు చెందిన పది కుటుంబాల వారు వీధి పండగలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

దేవరాపల్లి, కె.కోటపాడుల్లో భారీ వర్షం



దేవరాపల్లిలో కురుస్తున్న భారీ వర్షం

దేవరాపల్లి/కె.కోటపాడు/మాడుగుల రూరల్: మూడు మండలాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం భారీ వర్షం కురిసింది. గత వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. పంట పొలాల్లోకి నీరు చేరింది.

ఈ వర్షం ఖరీఫ్ వరి నారుమడులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. దేవరాపల్లి మండలంలో 2.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కె.కోటపాడు మండలంలో కె.కోటపాడు, చౌడువాడ, గుల్లేపల్లి, లంకవానిపాలెం, ఆనందపురం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మాడుగులలోనూ వర్షం పడింది.

ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా మాలలు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కృష్ణ స్వరూప్ తదితరులు

రాంబిల్లి: మాలలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని మాల మహానాడు కమిటీ గౌరవాధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వి. కృష్ణ స్వరూప్ అన్నారు. ఆదివారం రాంబిల్లి మండలం కొత్తూరులో అనకాపల్లి జిల్లా మాల మహానాడు కమిటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జె.సి. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ మాలల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో విజయబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యుల సర్వ సభ్య సమావేశం



హోమియో సృష్టికర్త హనీమాన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైద్యులు

మహారాణిపేట: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ విశాఖ జిల్లా శాఖ హోమియో వైద్యుల సర్వసభ్య సమావేశంలో నగరంలో ఒక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా హోమియో సృష్టికర్త డాక్టర్ శామ్యూల్ హనీమాన్ 180వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్ర రావు వైద్య రంగంలో హోమియోకు ప్రముఖ స్థానముందన్నారు. నిరంతర వైద్య,విద్యా కార్యక్రమంలో భాగంగా పిల్లలలో వచ్చే ఆటిజమ్ వ్యాధి – హోమియో వైద్యం అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.రాజేంద్ర ప్రసాద్ , డాక్టర్లు కె.శర్మ, బి.వెంకటేష్, జి.రాధిక , రాజా శ్రీకాంత్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు ఏటీడబ్ల్యూవోకు అప్పగింత



గిరిజన బాలుడిని ఏటీడబ్ల్యూవోకు అప్పగిస్తున్న కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్

నర్సీపట్నం : తప్పిపోయి నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏడుస్తున్న బాలుడిని నాతవరం మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ రజాక్ ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్‌కు అప్పగించారు. రాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బాలుడు ఏడుస్తూ కనిపించడంతో ఆర్టీసీ సిబ్బంది అతడిని చేరదీసి వివరాలు ఆరా తీశారు. తనది పాడేరు సమీపంలో పనసపల్లి అని, 6వ తరగతి చదువుతున్నానని, తండ్రి పేరు కామరాజు ఆ బాలుడు తెలిపాడు. దీంతో సిబ్బంది రజాక్‌కు సమాచారం అందించగా ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. బాలుడి విషయం పాడేరు ఐటీడీఏ పీవోకు సమాచారం అందించారు. ఆయన సూచన మేరకు బాలుడిని నర్సీపట్నం ఏటీడబ్ల్యూవోకు అప్పగించారు.

యాదవ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి



విద్యార్థిని సత్కరిస్తున్న యాదవ సంక్షేమ సంఘం నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణయాదవ్

- అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధులు
- టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన 160 మందికి పురస్కారాలు

అనకాపల్లి రూరల్: యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జిల్లా యాదవ సంక్షేమ సంఘం నేతలు, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. మండలంలోని తుమ్మపాలలో ఆదివారం నూతన కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దీనిలో భాగంగా 2023లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసి సత్కరించారు. పదో తరగతిలో 500పైగా మార్కులు పొందిన 140 మందికి, ఇంటర్మీడియట్‌లో 900పైగా మార్కులు సాధించిన 40 మందిని సత్కరించారు. సామాజిక వర్గంలో ఇంటర్‌లో 986 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన మునగపాకకు చెందిన కోళ్ల చంద్రికకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం పొందిన బొబ్బిలి రాజ్యలక్ష్మికి రూ.3 వేలు, పదో తరగతిలో 590 మార్కులు పొందిన నక్కపల్లికి చెందిన కురందాసు నీరజకు రూ.5 వేలు, 587 మార్కులతో ప్రతిభ చూపిన సబ్బవరానికి చెందిన సింగంపల్లి జయశ్రీ, తుమ్మపాలకు చెందిన బోయిన సాద్వికలకు రూ.3 వేల చొప్పున ప్రోత్సాహకాలు ఇచ్చారు. మిగిలిన విద్యార్థులందరికీ వెయ్యి రూపాయల చొప్పున నగదు, జ్ఞాపిక, బ్యాగులను అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరణికాన రామారావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, అనకాపల్లి డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, పల్లా పెంటారావు, సబ్బి శ్రీనివాస్, కరక సోమునాయుడు, భరణికాన నర్సింహమూర్తి, పెగడ చిన్నారావు, నమ్మి అప్పలరాజు, మొల్లి ముత్యాలనాయుడు, ఉప్పిలి అప్పలకొండ, పంచదార్ల సూరిబాబు, గంటా శ్రీరాం, దేవర సత్యనారాయణ, ధూళి రంగనాయకులు, కురందాసు నూకరాజు, బంధం వెంకటరమణ, వియ్యపు సింహాచలం, గోకివాడ కోటేశ్వరరావు, మొల్లి ప్రసాద్, పంచదార్ల కన్నారావు పాల్గొన్నారు.

55 మంది ఎంఈవోలకు పోస్టింగ్‌లు

మధురవాడ ఆర్‌జేడీ ఆఫీసులో ప్రశాంతంగా కౌన్సెలింగ్



మధురవాడలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్‌జేడీ జ్యోతి కుమారి

మధురవాడ : విశాఖ జోన్–1 పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వివిధ మండలాలకు విద్యాశాఖ అధికారులు–1లను నియమిస్తూ ఆర్‌జేడీ జ్యోతికుమారి ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. మధురవాడ విద్యాశాఖ ప్రాంతీయ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్ – 2 ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నో ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంతో వారి కల సాకారమైనందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 38 మండలాలు ఉండగా 16 పోస్టులు, విజయనగరంలో 34 మండలాలు ఉండగా 17 పోస్టులు, విశాఖ జిల్లాలో 46 మండలాలు ఉండగా 41 ఖాళీలు ఉన్నాయి. మొత్తంగా మూడు జిల్లాల్లో 118 మండలాలు ఉండగా 74 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ 74 పోస్టులకు గ్రేడు–2 హెచ్‌ఎంలతో సీనియార్టీ జాబితా తయారు చేశారు. వీరిలో 71 మంది కౌన్సెలింగ్‌కి హాజరయ్యారు. 55 మంది పదోన్నతి కోరుకోగా మిగిలిన వారు పదోన్నతి వద్దనుకున్నారు. ఇంకా ఈ జిల్లాల్లో 19 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నట్టు ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి చెప్పారు. ఈ కౌన్సెలింగ్‌లో ఏడీ జి.శ్రీరామ్మూర్తి, అనకాపల్లి జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏడీ రమాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో డిజిటల్ వెలుగులు

- ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌పై బోధనకు అంతా సిద్ధం
- పాఠశాలలకు చేరుతున్న సాంకేతిక ఉపకరణాలు
- ఐఎఫ్‌పీ వినియోగంపై ఉపాధ్యాయులకు నేటి నుంచి శిక్షణ



విశాఖ నగరంలోని ఎన్‌ఎంసీ ప్లస్ టూ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీపై పాఠ్యాంశం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. జాతీయ విద్యావిధానం అమలుతో ఇతర రాష్ట్రాల వారితో మన విద్యార్థులు పోటీ పడేలా సన్నద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీల ద్వారా పాఠ్యాంశాల బోధనకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిదశలో నాడు – నేడు కింద అభివృద్ధి చేసిన విశాఖలో 109, అనకాపల్లిలో 334, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 368 స్కూళ్లను ఎంపిక చేశారు. తరగతుల సంఖ్యకు అనుగుణంగా హైస్కూళ్లకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, ఫ్రీ ప్రైమరీ స్కూళ్లకు స్మార్ట్ టీవీలను సరఫరా చేస్తున్నారు. ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను యుద్ధ ప్రాతిపదికన తరగతి గదుల్లో అమర్చుతున్నారు.

తరగతి గదిలోనే విశ్వ వీక్షణం

ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టీవీలకు ఇంటర్నెట్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటి వరకు గ్రీన్ చాక్ బోర్డుపై పాఠ్యాంశాల బోధన జరుగుతుండగా, వాటి స్థానంలో ఐఎఫ్‌పీలను వినియోగించనున్నారు. ఇంటర్నెట్‌తో అనుసంధానమై ఉన్నందున వీటినే టీవీల మాదిరే ఉపయోగించనున్నారు. బైజూస్ కంటెంట్‌తో నిక్షిప్తం చేస్తున్నందున పాఠ్యాంశాలను నేరుగా వీక్షించే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు ప్రపంచంలో ఏం జరుగుతుందనేది కళ్ల ముందే కనిపించనుంది.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా పాఠ్యాంశాల బోధన చేపట్టాల్సిన నేపథ్యంలో వీటిని ఎలా వినియోగించాలనే దానిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు. సాంకేతికతపై అవగాహన కల్పించాల్సిన నేపథ్యంలో శిక్షణ కోసమని పలు ఇంజినీరింగ్ కాలేజీలను ఎంపిక చేశారు. సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేశారు. మండలాల వారీగా కేటాయించిన ఇంజినీరింగ్ కాలేజీలకు ఉపాధ్యాయులు హాజరుకావాలి.

జిల్లాల వారీగా తొలిదశలో ఇలా..

జిల్లా	పాఠశాలలు	ఐఎఫ్‌పీ	స్మార్ట్ టీవీలు	శిక్షణకు ఎంపికైన టీచర్లు
విశాఖపట్నం	109	794	146	2,287
అనకాపల్లి	334	1,146	354	5,688
అల్లూరి	368	1,349	205	3,908

శిక్షణకు ఎంపిక చేసిన కాలేజీలు ఇవే

రఘు ఇంజినీరింగ్ కాలేజీ (దాకమర్రి), ఎన్ఎస్ఆర్ఐటీ (నీలకుండీలు), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అనకాపల్లి), అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మాకవరపాలెం), రఘు ఇంజినీరింగ్ కాలేజీ (దాకమర్రి), సాయిగణపతి ఇంజినీరింగ్ కాలేజీ (గిడిజాల), విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (దువ్వాడ), విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఫర్ వుమెన్(దువ్వాడ).

సద్వినియోగం చేసుకోవాలి



విద్యా బోధనలో విప్లవాత్మక మార్పులను ప్రభుత్వం తీసుకొస్తోంది. మన విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పడాలనేది ప్రభుత్వ సంకల్పం. ఆ దిశగా అమలు చేస్తున్న విద్యా విధానంలో అందరూ భాగస్వాములు కావాలి. ఐఎఫ్‌పీ వినియోగంపై ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.జ్యోతికుమారి, ఆర్జేడీ, విశాఖపట్నం

శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలి



ఉపాధ్యాయులు తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాలి. ఏయే మండలాల వారు ఎక్కడికి రావాలనేది ముందుగానే సమాచారం ఇచ్చాం. పాఠశాలల నిర్వహణకు ఆటంకం లేకుండా బ్యాచ్‌ల వారీగా రావాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– గౌరీ శంకర్, డిప్యూటీ డీఈవో, విశాఖపట్నం

క్లుప్తంగా

మర్రిపాలెంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని కోడూరు పంచాయతీ పరిధి మర్రిపాలెం గ్రామంలో సోమవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

5న వృద్ధుల సమస్యలపై సమావేశం

అనకాపల్లిటౌన్ : జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం ఈ నెల 5న గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకులు కాండ్రేగుల అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల నుంచి 9 మంది అధికారులను, వివిధ సంక్షేమ సంఘాల నుంచి ఆరుగురు ప్రతినిధులతో నూతన కార్యవర్గాన్ని కలెక్టర్ నియమించినట్లు తెలిపారు. వృద్ధుల సమస్యలను కమిటీకి వివరిస్తే, వాటి పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందన్నారు.

'జగనన్న సురక్ష' నేడు

కశింకోట : మండలంలోని జి.భీమవరం, జెట్టపురెడ్డితుని సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, స్థానిక సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా కోరారు.

'సన్'డే!



కశింకోటలో ఎండ వేడికి వెలవెలబోతున్న ప్రధాన రహదారి

కశింకోట : మండల ప్రజలను వరుసగా ఐదో రోజు కూడా ఉష్ణతాపం వీడలేదు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోయారు. వృద్ధులు, పిల్లలు ఎండ ప్రభావంతో ఇబ్బంది పడ్డారు. ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పనులు ఉన్న వారు తప్ప, మిగిలిన వారు బయటకు రావడానికి సాహసించలేదు. దీంతో కశింకోటలో నిత్యం రద్దీగా ఉండే స్థానిక ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం మబ్బులుపట్టి చిన్నపాటి జల్లులు కురవడంతో వాతావరణం కాస్త చల్లబడి, ప్రజలు ఉపశమనం పొందారు.

అనకాపల్లి సినిమాలు

లవ్ యూ రామ్	రాజా
టక్కర్	సత్యనారాయణ స్క్రీన్-1
ఇండియానా జోన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది? (మార్నింగ్,మ్యాట్నీ)	
మాయా పేటిక (ఫస్ట్,సెకెండ్ షో)	షిర్డిసాయి
అశ్విన్స్	పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచి(3 ఆటలు)	
నారాయణ అండ్ కో	వెంకటేశ్వర
స్పై	శ్రీసత్య
సామజవరగమన	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 282 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 224 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాలు కూడా దాదాపు నిండు కుండల్లా ఉన్నాయి. దీంతో సాగు విస్తీర్ణం ఏడాదికేడాది పెరుగుతోంది. ప్రధానంగా వరి సాగుపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. చెరకు సాగు భూముల్ని కూడా వరి సాగుకు మళ్లిస్తున్నారు. ఈ ఏడాది కూడా కశింకోట మండలంలో గతం కంటే ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు జరగనుందని వ్యవసాయ అధికారుల అంచనా.



నారుమళ్లు వేయడానికి దుక్కి దున్ని సిద్ధం చేసిన పంట భూమి



భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

- కశింకోట మండలంలో 892 హెక్టార్ల సాగు అంచనా
- అందుబాటులో 620 క్వింటాళ్ల వరి విత్తనాలు

కశింకోట : మండలంలో ఖరీఫ్ వరి సాగుకు రైతాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే నారుమళ్లు వేయడానికి పలుచోట్ల భూములను దున్ని సిద్ధం చేశారు. మరికొందరు క్రిమి కీటకాలు, గడ్డి నశించేలా దుక్కు పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో ప్రధానంగా వరి, చెరకు పంటలను ఎక్కువగా పండిస్తారు. వీటిలో రెండో స్థానంలో ఉండే వరి గత మూడేళ్లుగా అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 892 హెక్టార్లుగా అధికారులు నిర్ణయించారు.

మూడేళ్లుగా పెరుగుతున్న వరి సాగు

మండలంలో 2020 సంవత్సరం నుంచి సాధారణ విస్తీర్ణాన్ని మించి వరి పంట సాగవుతోంది. అంతకు ముందు చెరకు పంట ప్రథమ స్థానంలో ఉండేది. బెల్లానికి గిట్టుబాటు తగ్గడం, చెరకు పంటకు ఎర్రకుళ్లు తెగులు, పసుపాకు తెగులు ఆశించి దిగుబడి, ఎదుగుదల గణనీయంగా తగ్గి నష్టం కలిగిస్తోంది. చెరకును కొనుగోలు చేసే తుమ్మపాల సుగర్ పరిశ్రమ మూతపడటం వంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా వరి సాగుపై రైతులు దృష్టి సారించారు. 2020లో వరి సాధారణ విస్తీర్ణం 818 హెక్టార్లు కాగా, 914 హెక్టార్లలో సాగు జరిగింది. 2021లో 833 హెక్టార్ల సాధారణ సాగుకు, 979 హెక్టార్లు, 2022లో 819 హెక్టార్లకుగానూ 1,133 హెక్టార్లలో వరి పంట వేశారు. దీంతో ఈ ఏడాది కూడా వరి సాగు విస్తీర్ణం గతం కంటే పెరుగుతుందని అధికారుల అంచనా.

వర్షాధారంగానే వరి సాగు

మండలంలో ఎక్కువగా వర్షాధారంగానే పంటలు పండిస్తారు. ఖరీఫ్ వరి అయితే దాదాపు వరుణుడిపైనే భారం. శారదానదిపై ఆనకట్టల నుంచి కాలువల ద్వారా వచ్చే సాగునీరు, చెరువుల నీరు కూడా వరి సాగును ప్రోత్సహిస్తున్నాయి. సొంత బోరు, మోటారు సదుపాయం ఉన్న కొందరు బోరు నీరుతో సాగు చేస్తారు. సాధారణంగా జూలై నెల నుంచి నారుమళ్లు పోసి నాట్లు వేస్తారు. కన్నూరుపాలెం, చెరకాం, తీడ, సుందరయ్యపేట తదితర గ్రామాల్లో బోర్లు, మోటార్ల సాయంతో ముందుగానే పంట వేస్తారు.

మిగిలిన గ్రామాల్లో వర్షాధారంతో పంట సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో పంట భూముల్ని దున్ని, నారుమళ్లు వేసే పనిలో రైతులు బిజీ అయ్యారు.

ఆర్జీఎల్ రకం విత్తనాలపై మొగ్గు

మండల వ్యవసాయ సిబ్బంది భూ పరీక్షల నిర్వహణకు గ్రామాల వారీగా 345 నమూనాలను సేకరించారు. మండలంలో భూములకు ఆర్జీఎల్ వరి రకం సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు వాటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు కూడా ఆర్జీఎల్ రకం విత్తనాలను రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకున్నారు. మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆర్జీఎల్‌తో పాటు సాంబమసూరి, సోనామసూరి తదితర రకాలకు చెందిన 620 క్వింటాళ్ల విత్తనాలను, విత్తన శుద్ధి మందును సిద్ధం చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ద్వారా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ వరి విస్తీర్ణం పెరగనుంది. చెరకు రైతులు వరి సాగుపట్ల ఆసక్తి చూపుతున్నారు. ఆర్బీకేల ద్వారా వరి విత్తనాలను పంపిణీకి సిద్ధం చేశాం. కశింకోటలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమయింది. సాగుకు కావాల్సిన సహాయ సహకారాలందించేందుకు మా సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

–స్వప్న, మండల వ్యవసాయ శాఖ అధికారి, కశింకోట

మర్యాదపూర్వక కలయిక



ఎంపీ దంపతులను సత్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఎంపీ భీశెట్టి సత్యవతిని ఆమె కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులకు జ్ఞాపిక అందజేసి శాలువాలు వేసి సత్కరించారు. జిల్లాలో పార్టీ అభివృద్ధి పట్ల కాసేపు చర్చించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ఉపకార వేతనాలు



విద్యార్థినికి ఉపకారవేతనం అందిస్తున్న వైద్యుడు విష్ణుమూర్తి

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచి ప్రణాళికాయుతంగా ఇష్టపడి చదువుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్, గౌరీ సేవాసంఘం మాజీ అధ్యక్షుడు మళ్ల సాంబశివరావు అన్నారు. గవరపాలెంలోని కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ హాల్లో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2023 వరకూ ఉత్తమ మార్కులు సాధించిన వారికి ఉపకారవేతనాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. కరోనా విపత్తుల కారణంగా నేటి వరకూ ఉపకార వేతనాలు విద్యార్థులకు అందజేయలేకపోయినట్టు పేర్కొన్నారు. టెన్త్ ఆపై తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 200 మందికి రూ.10 లక్షల ఉపకారవేతనాలు అందించారు. కార్యక్రమంలో గౌరీ సేవాసంఘం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివన్నారాయణ, వైద్యుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, సభ్యులు పెంటకోట ఉమామహేశ్వరరావు, బాలకృష్ణ, ఆళ్ల లక్ష్మీనరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడు భగవంతుడితో సమానం



డాక్టర్ రాజశేఖర్‌ను సత్కరిస్తున్న కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు

తుమ్మపాల : తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యుడు పునర్జన్మనిస్తాడని డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కొణతాల లక్ష్మీపార్వతి అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్స్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజశేఖర్‌ను ట్రస్ట్ సభ్యుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, ప్రముఖ వ్యాపారవేత్త వెంగళరావు, రామకృష్ణ, నయిశెట్టి చిన్నాతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా విపత్తులో వైద్యులు ముందుండి అనేక మంది ప్రాణాలను కాపాడిన విషయాన్ని గుర్తుచేశారు. డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ అంకిత భావంతో వైద్యం చేస్తూ, రోగుల్ని చిరునవ్వుతో పలకరిస్తూ మానవతా విలువలు చాటుకున్న వారే గొప్ప వైద్యులు అవుతారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఆలయంలో హారతి కార్యక్రమం



మాట్లాడుతున్న సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ రామాలయంలో సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు మాట్లాడుతూ దేవాలయం కేంద్రంగా హారతి నిర్వహించాలని, వారానికి ఒకసారి భజన చేయాలని సూచించారు. గ్రామంలోని ప్రజలందరినీ భాగస్వామ్యం చేస్తూ ఇంటింటా ధర్మ ప్రచారం, నెలకు ఒకసారి ఏకాదశి రోజున నగర సంకీర్తన చేయాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా కన్వీనర్ రెడ్డి రమణమ్మ, ఎం.రమణమ్మ, కనకమ్మ, సూర్యకాంతం, సత్యవతి, మండల కన్వీనర్ అనకాపల్లి వెంకట రమణ, సహ కన్వీనర్, దాసరి రాము, మద్దాల శ్రీను, దాడి లక్ష్మణరావు, దార త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కారిడార్ రహదారికి మోక్షం





ఎన్టీపీసీ కారిడార్ రోడ్డును మెటల్ వేసి అభివృద్ధి చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కారిడార్ రహదారికి మోక్షం లభించింది. మరమ్మతులతో మూలుగుతున్న ఎన్టీపీసీ రహదారి శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎన్టీపీసీ అధికారులు స్పందించారు. సింహాద్రి నుంచి ఏర్పాటు చేసిన కారిడార్ రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు శిథిలావస్థకు చేరి పెద్ద గుంతలు పడ్డాయి. రహదారి గుంతలమయంగా మారడంతో ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతుండేవారు. అలాగే వాడచీపురుపల్లి, దలాయిపాలెం, కలపాక, పిట్టవానిపాలెం ప్రాంతాల ప్రజలు రోడ్డులో ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల అవస్థలను గుర్తించిన సంస్థ అధికారులు గుంతలు పడిన కారిడార్ రహదారికి మరమ్మతులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. రోడ్డును బీటీ రోడ్డుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణ పనులు జోరుగా సాగుతుండడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



అప్పలరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: ఇటీవల విద్యుత్ పోల్ పడి గాయపడ్డ పైడివాడ అగ్రహారం సర్పంచ్ వద్దాది అప్పలరాజును స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం పరామర్శించారు. త్వరలో పూర్తిగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ఇటీవల పాము కాటుకు గురైన ఇరువాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగారు నాయుడును కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, మోపాడ అప్పారావు, కాపుశెట్టి శేషుబాబు, కర్రి అప్పారావు, స్థానిక నాయకులు ఉన్నారు.

తోటాడలో ఘనంగా గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మునగపాక : మండలంలోని తోటాడలో ఆదివారం గిరి ప్రదర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. తోటాడలోని శ్రీ ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఓంకార పీఠం నుంచి భక్తులు భజనలు చేస్తూ త్రిమూర్తుల ఆలయం, పాటిపల్లి కాలనీ, వరాహ నరసింహ స్వామి ఆలయం, నారాయుడుపాలెం మీదుగా ఓంకార పీఠం వరకు ఊరేగింపు నిర్వహించారు. కాగా సోమవారం ఆలయ ప్రాంగణంలో గురు పౌర్ణమి సందర్భంగా భారీ అన్న సమారాధన జరుగుతుందని మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుకుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మునగపాకకు చెందిన పెంటకోట రామయ్య కుటుంబ సభ్యులు గిరి ప్రదక్షిణలో భాగంగా విశాఖలో భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు.

బొడ్డేడకు అభినందన



బొడ్డేడకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు

పరవాడ: అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బొడ్డేడ ప్రసాద్‌కు రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు ఉన్నారు.

నెల రోజుల్లో ఇంటింటికీ కుళాయిలు

- రెండు మాసాల్లో గ్రామాల్లో డ్రైనేజీ పనుల ప్రారంభం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



వెంకటరమణపేటలో మంత్రి అమర్‌నాథ్‌కు బొట్టు పెడుతున్న వెంకటరమణపేట మహిళ



తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు నెల రోజుల్లో ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేట, పెద్ద అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్వర్యంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి హాజరైన మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుంటూ తక్షణ పరిష్కారానికి అధికారుల్ని ఆదేశించారు. వృద్ధుల వద్దకు వెళ్లినప్పుడు వచ్చే ఏడాది జనవరి నుంచి రూ.3,000 పెన్షన్ అమల్లోకి వస్తుందని చెప్పినప్పుడు, వారి సంబరాన్ని చూసి మంత్రి ఎంతో ఆనందించారు. గ్రామంలో కాలువల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్న స్థానికుల అభ్యర్థన మేరకు సంబంధిత అధికారులను పిలిచి, రెండు మాసాల్లో కాలువల్ని పునరుద్ధరించాలని ఆదేశించారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, సీఎంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. రూ.9 లక్షలతో నిర్మించిన తాగునీటి వాటర్ ట్యాంక్‌ను మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారాన్ని భరించి భరించి బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడకుండా సకాలంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోను శతశాతం అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలకు నోచుకోని అర్హులు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ డి.అప్పలరాజు, పార్టీ నాయకులు బుంటు శివనాయుడు, కరణం సత్యనారాయణ, అక్కిరెడ్డి శ్రీను, నారిపిన్ని ప్రసాద్, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొట్లాటలో వ్యక్తికి తీవ్రగాయాలు

అనకాపల్లిటౌన్ : మండలంలోని తుమ్మపాలలో ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఇద్దరు వ్యక్తుల మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. పట్టణ సీఐ దాడి మోహన్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన కె.సాయి మద్యం సేవించేందుకు బార్‌కు వెళ్లాడు. అప్పటికే బార్‌లో ఉన్న వెంకటేష్, సాయిల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ ఏర్పడింది. దీంతో వెంకటేష్ పక్కనే ఉన్న బీర్ బాటిల్ తీసుకుని సాయిని పక్కటెముకల భాగంలో బలంగా పొడవడంతో సాయి తీవ్రంగా గాయపడినట్టు సీఐ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్షతగాత్రుడ్ని మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

దంతవైద్యురాలి మృతికి సంతాపం



రజనినూతన్ (ఫైల్)

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో దంత వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న రజని నూతన్ గుండెపోటుతో విశాఖపట్నంలోని ఆమె స్వగృహంలో ఆదివారం మృతిచెందారు. ఈమె మరణం పట్ల వైద్యాలయంలో సహచర వైద్యులతోపాటు సిబ్బంది సంతాపం తెలిపారు.

50 మంది యువత రక్తదానం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం రామాలయంలో ఆదివారం కశింకోట కాప్స్ రాక్స్ కేఎస్ఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వంగవీటి మోహన్‌రంగా జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ నిర్వాహకులు సర్టిఫికెట్లు అందించారు. ముందుగా రంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.